


## దళిత సోదరులకు నా వంతు

# సహకారం అందిస్తా

- దళితులకు రక్షణగా నిలిచిన ఏకైక నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- నెల్లూరు జిల్లా టీడీపీ ఎస్సీసెల్ నేత చాట్ల వెంకటసుబ్బయ్య




**నెల్లూరు,సెప్టెంబర్14,(నవభూమి)::**సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని ముత్తుకూరు, వెంకటాచలం,గుడ్లూరు వారిపాలెంలో స్థానిక దళితుల మీద,బెల్లంకొండ వేణు మీద దాడులు చేయడంలో జరిగిన వాస్తవ విషయాలపై నిజనిర్ధారణ కమిటీ వేసి.. పోలీస్,రెవెన్యూ,దళిత సంఘల నాయకుల సమీక్షంలో విచారణ జరిపితే వాస్తవాలు తెలుస్తాయని.. ముత్తుకూరు సంఘటనలో దళిత సోదరులకు న్యాయ విచారణ జరిపించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చాట్ల వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు.నెల్లూరు నగరంలోని ప్రెస్ క్లబ్ లో తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చాట్ల వెంకటసుబ్బయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ,ఎస్టీ సోదరులు అనేకమంది పోలీసుల వేధింపులు ఎదుర్కొని,కొంతమంది ఆర్థికంగా,మానసికంగా నష్టపోయారన్నారు.తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం దళితులకు అండగా ఉంటూ.. దళిత సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.దళిత వర్గానికి చెందిన అధికారులు సైతం అప్పటి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి దాహానికి,అక్రమాలకు బలై ఉద్యోగాలు సైతం కోల్పోవాల్సి వచ్చిందన్నారు.ముత్తుకూరు మేజర్ పంచాయతీలో దళిత సోదరులను గత నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా అగ్ర వర్ణాల నేతల స్వార్థానికి వాడుకొని,చిచ్చులు పెట్టి, పైశాచిక ఆనందం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పొందుతున్నారని విమర్శించారు.నెల్లూరు జిల్లాలో దళితులకు రక్షణగా నిలిచిన ఏకైక ఏకైక నాయకుడు సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాత్రమేనని గర్వంగా చెప్తున్నాను అన్నారు.భవిష్యత్తులో దళితులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.ఇటీవల ముత్తుకూరులో జరిగిన సంఘటనలో దళిత సోదరులకు న్యాయ విచారణ జరిపించేందుకు.. తన వంతు సహకారం అందిస్తానన్నారు.తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైంది అని వస్తున్న ఆరోపణలు అవాస్తవాలు అన్నారు.



## కొనసాగుతున్న సిఐటియు, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితులకు భోజనాలు

2

# దళితులపై దాడులు

## చేస్తే సహించం: ఎమ్మార్పీఎస్




**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 14 (నవభూమి):** దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, రాష్ట్ర నాయకులు కోడుమూరు ఆంధ్రయ్య మాదిగ, ఆదోని బండారి హనుమంతు మాదిగ, జి. ఆనంద్ చైతన్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రెడ్డి పోగు భాస్కర్ మాదిగలు పేర్కొన్నారు. శనివారం వారు పెద్దకడబూరు మండలం, కల్లుకుంట గ్రామంలో జరిగిన దారుణంలో బాధితురాలైన దళిత మహిళ గోవిందమ్మ ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గోవిందమ్మ కుమారుడు ఈరన్న బీసీ చాకలి సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మి ని ప్రేమ పెళ్లి చేసుకున్నాడని జీర్ణించుకోలేక మాదిగ గోవిందమ్మ ను గురువారం రాత్రి కల్లుకుంట గ్రామంలో గ్రామానికి కరెంటు బంద్ చేసి, చీకటిలో కరెంటు స్తంభానికి కట్టేసి, కొట్టి విచక్షణ రహితంగా దాడి చేసి,చీర,రవికను చించి వేసి, యువతి అన్న అయిన వికలాంగుడు చేత వితంతువురాలైన గోవిందమ్మకు తాళి కట్టించే ప్రయత్నం చేయడం అమానవీయ సంఘటన అని, ఈ ఘటన ఆటవిక చర్యగా తలపిస్తోందన్నారు. బాధితురాలకు న్యాయం జరిగేలా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కల్లుకుంట గ్రామాన్ని సందర్శించాలని, నేరం చేసిన మానవ మృగాలను జైలుకు పంపి, కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో.జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగ,హాలహర్వి గంధాలం ప్రభాకర్ మాదిగ,దేవన్న మాదిగ, గార్లదిన్నె పౌలు మాదిగ, కారుమంచి రాముడు మాదిగ, కైరవాడి దేవేంద్ర మాదిగ, కోసిగి మండలం నాయకులు దుర్గప్ప మాదిగ, నాగరాజు మాదిగ, నరసింహులు మాదిగ, కోడి ఉరుకుంది, సన్నకి ఈరన్న (చిన్న) మాదిగ, కౌతాళం మండలం నాయకులు ఆనంద్ మాదిగ, సురేష్ మాదిగ, రామంజి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో చిన్న మట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు



4

## వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ-యుటిఎఫ్ కూనవరం





**కూనవరం నవభూమి న్యూస్ :-** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శబరి కొత్త గూడెం గ్రామంలోని కుంజా వారి గుంపు వాళ్ళు ఇటీవల వచ్చిన అత్యంత భారీ వర్షాలు, వరదలు రావడం వలన తెల్లంవారి గుంపు దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వారం రోజులు పైగానే ఉంటున్న కుటుంబ సభ్యులందరికీ యు.టి.ఎఫ్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన దుప్పట్ల ను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కూనవరం మండల కమిటీ తరపున వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు యు.టి.ఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు మాట్లాడుతూ సామాజిక స్పృహ కల్గిన సంఘంగా ఎప్పుడు సేవ చేసే విషయంలో మా వంతు విరాళాలు సేకరించి ఆపదలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యు.టి.ఎఫ్.కూనవరం మండల కమిటీ సభ్యులు కుంజా.శాంత, చిడెం.సత్యవతిదేవి, కట్టం.కుమారి,చిచ్చడి.వెంకటమహాతి,జోడెం.గౌతమి, మడకం. ప్రమీల, మండల కమిటీ కార్యవర్గ సభ్యులు తుష్టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బాధిత కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేసిన హెల్పింగ్ హాండ్స్

**కూనవరం నవభూమి న్యూస్** కూనవరం మండలం పల్లూరు గ్రామానికి చెందిన ఆవుల వెంకటరామరావు ఎలక్ట్రీషియన్ (28) తండ్రి బాబు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వాట్సాప్ గ్రూపు ద్వారా హెల్పింగ్ హాండ్స్ మిత్ర బృందం సందేశం ఇవ్వగా మానవతా దృక్పథం తో స్పందించి రూ. 50032 లు ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆదుకోవటానికి సహృదయంతో స్పందించి ఆర్థికంగా సహకరించిన ప్రతి ఒక్కరికి హెల్పింగ్ హాండ్స్ మిత్ర బృందం ఆవుల సంతోష్ కుమార్, కర్నాటి సాయి ప్రదీప్, ఆవుల వెంకటేష్ మరియు సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆవుల ఉపేంద్ర, ఆవుల గురవయ్య, ఆవుల మురళీకృష్ణ, కర్నాటి శ్రీను, శ్రీమంతుల వెంకట రమణ, ఆవుల గోపాల కృష్ణ, పరిటాల వెంకట్, నస్కూరి, కరక సర్వేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.



### కొనసాగుతున్న సిఐటియు, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వరద

# బాధితులకు భోజనాలు



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 14, (నవభూమి)** జగ్గయ్యపేట మండలంలోని జయంతి పురం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో మూడవరోజు శనివారం సిఐటియు, సిపిఎం పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు భోజనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏవి ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటా కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు బండ్ల జ్ఞాన ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు ఏ వి ఆంజనేయులు, సిహెచ్ సైదులు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ, రెడ్యానాయక్ తండా, అన్నవరం, జయంతిపురం తదితర గ్రామాల్లో వరదల వలన అనేక ఆస్తి నష్టం జరిగిందన్నారు. వరదల వల్ల కనీవిని ఎరగని రీతిలో నష్టం వాటిల్లింది అన్నారు. ఇంకా జయంతిపురం గ్రామంలో 50 ఇండ్లలో వరద నీరు ఉందని తక్షణమే వరద బాధితులను ఆదుకోవాలని అన్నారు. ఆయా గ్రామాలలో అనేక ఇల్లు నేలమట్టం కావటం, ఇండ్ల గోడలు పడిపోయాయని, ఇంట్లోని గల సామాన్లు, గ్యాస్ బండలు, బట్టలు, కుట్టు మిషన్లు, బియ్యం, ధాన్యం వరద ఉధృతికి కొట్టుకొని పోయాయి అన్నారు. పంట భూములు సైతం కొట్టుకొని పోయి తీవ్ర నష్టం వాటిలిందని, పంటలు మునిగిపోయి తీవ్ర నష్టం వాటిలిందని తక్షణమే ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ గౌస్ మియా, సిపిఎం పార్టీ నాయకులు రావెళ్ల శేషు, వివి రాంప్రసాద్, భూసమ్మ, కోటా రవికుమార్, బాలు, దంతాల నరేంద్ర, దంతాల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.వరదల వలన నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి.2.వార్త ఏపీ రైతు సంఘం కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఏవి ఆంజనేయులు, సిహెచ్ సైదులు డిమాండ్.జగ్గయ్యపేట ,నవ భూమి ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలకు పాలేరు పరివాహక గ్రామాలలో కోతకు గురైన భూములు, మోటర్లు కొట్టుకొని పోవటం, పత్తి, వరి, మిర్చి పంటలు దెబ్బతినడంతో రైతులు, కౌలు రైతులకు ఈ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చేయని కాబట్టి తక్షణమే రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఏ వి ఆంజనేయులు, చెనుమోలు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, రెడ్యానాయక తండా, బూదవాడ గ్రామాల్లోని ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు కోతకు గురైన భూములు, మోటర్లు, ట్రాన్స్ ఫార్మర్, ఎత్తిపోతల పథకాలను శనివారం రైతులు, కౌలు రైతులతో కలిసి ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఏవి ఆంజనేయులు సిహెచ్ సైదులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలేరు పరివాహక ప్రాంతంలో భూమి ఎక్కువగా కోతకు గురై రైతులకు ఎంతో నష్టాన్ని మిగిల్చిందన్నారు. ఈ రైతులు ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారని ఆయా రైతులు ఒక ఎకరం, ఎకరం నర, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులేనని, వీరికి ప్రభుత్వం ద్వారా మూడు పంపింగ్ స్కీముల ద్వారా సాగునీరు అందిస్తుందని ఈ స్కీములు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. కాబట్టి తక్షణమే ఈ స్కీములకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ పరివాహ ప్రాంతంలోని సుమారు 500 వరకు మోటర్లు వరదల్లో కొట్టుకొని పోయాయని, పైప్ లైన్లు కూడా ధ్వంసం అయ్యాయని ఒక్కొక్క రైతుకు వీటి ద్వారా లక్ష రూపాయలు వరకు నష్టం వాటిలిందన్నారు. వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి అన్నారు. కోతకు గురైన భూమిని ప్రభుత్వం మరమ్మతులు చేయించి భూమిగా తయారు చేసి రైతులకు అప్పజెప్పాలన్నారు. దెబ్బతిన్న పొలాలకు వెళ్లే అంతర్గత రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని, త్వరితగతిన మోటార్లకు కరెంట్ సరఫరా చేయాలని, దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోటా కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి గోపి నాయక్, రైతులు జి నాను, జి శ్రీను, భూక్య బిక్యా, రేగండ్ల శ్రీనివాసరావు, మీగడ పుల్లారావు, పోతుపాక పేరయ్య, అమరవరపు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు అండగా

# వైసిపి నాయకులు

◆ ఆర్థిక సాయం అందజేత ◆ పార్టీలకు అతీతంగా సాయం అందించాలని పిలుపు

**కౌతాళం, సెప్టెంబర్14(నవభూమి న్యూస్):** మానవతా దృక్పథంతో వైఎఎస్సార్ సీపి మండల అధ్యక్షులు ప్రహల్లాద ఆచారి విజయవాడ వరద బాధితులకు తనవంతుగా ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ మేరకు కౌతాళం లోని వైసీపీ పార్టీ కార్యాలయంలో.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ కాశీ విశ్వనాథ్ కు నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకరన్ , ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, మంజునాథ,రహిమాన్, సౌదరి, సోమన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ లో వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థికంగా నష్టపోయారన్నారు. వారికి సాయం అందించేందుకు పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.



# వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్ అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట ,నవ భూమి ,సెప్టెంబర్ 14:** బిజగ్గయ్యపేట మండలం, జయంతిపురం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతికి జయంతి పురం గ్రామ వాసులు సామాగ్రి కొట్టుకుపోయి ఇబ్బంది పడుతున్నటువంటి వారికి జగ్గయ్యపేట శ్రీ సాయి మెడికల్ కోటి ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు మరియు టవల్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని బాధితులకు దుప్పట్లు టవల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, మాజీ ఎంపీటీసీ లు బండ్ల జ్ఞాన ప్రకాష్, ఇస్లావతు శ్రీనివాసరావు మరియు నాయకులు భూక్య వెంకటేశ్వర్లు, లాహోరీ కాజా, తాళ్లూరి దుర్గ, యంగ్రాతి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌గా మారిన జగ్గయ్యపేట స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్




**జగ్గయ్యపేట,నవ భూమి ,సెప్టెంబర్ 14:** ప్రభుత్వము స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విభాగమును రద్దు చేయడమే కాకుండా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖను 2020 మే ముందున్న రూపానికి పునః నిర్మిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట లోని తొర్రగుంట పాలెం నందు గల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ రద్దు కాబడి దాని స్థానంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ గా మార్పు దిద్దుకుంది. 2020 మే కి ముందు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏ ఏ విధులు అయితే నిర్వహించారో ఆ విధులను ఇప్పటినుండి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తుంది. ఇప్పటినుండి జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, నాటు సారాయి, గంజాయి మరియు ఇతర డ్రగ్స్ తదితర నేరాలను నిర్మూలించుటకు కృషి చేయడమే కాకుండా ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలు , ఇథనాల్ మిథనాల్ యూనిట్లు తదితర తదితర ప్రభుత్వ నుంచి లైసెన్స్ పొందిన 74 విభాగాలకు చెందిన అంశాలలో సక్రమంగా నిర్వహణ జరిగే విధంగా పర్యవేక్షించడం తదితర విధులను నిర్వహిస్తుంది. ప్రభుత్వం శుక్రవారం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ యొక్క పరిధిలో జగ్గయ్యపేట మరియు వత్సవాయి మండలాలు గలవు. ఈ స్టేషన్ 1 ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో 2 ఎస్ఐలు మరియు 3 హెడ్ కానిస్టేబుల్స్, 12 మంది కానిస్టేబుల్స్ తో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట పట్టణంలో తొర్రగుంటపాలెం నందు ఇప్పటివరకు పని చేస్తున్న స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ స్థానంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పనిచేస్తుందని జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. పైన తెలిపిన నేరాలకు సంబంధించి ఏ విధమైన సమాచారం ఉన్నను 9 4 4 0 9 0 2 4 6 1 నెంబర్ కు సమాచారం అందించవలసిందిగా జగ్గయ్యపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. మణికంఠ రెడ్డి తెలిపారు.

### విలీన మండలాల రైతులపై ఐటిసి సంస్థ

# భద్రాచలం పేపర్ బోర్డ్ వివక్ష

- ఐటీసీ సంస్థ కొనుగోలులో రైతులకు మొండి చేయి
- పైరవీలు చేసుకున్న కాంట్రాక్టర్లకు పైసలు చెల్లింపు
- నష్టపోతున్న స్థానిక రైతులు
- ప్రాంతాన్ని బట్టి రేటు కేటాయింపు
- ముడి సరుకులోను అవకతవకలు



**కూనవరం నవభూమి న్యూస్** తెలంగాణలోని సారపాకలో ఉన్న ఐ టి సి భద్రాచలం పేపర్ బోర్డ్ పరిశ్రమ గతంలో స్థానిక రైతులకు వెన్నుదన్నుగా ఉండేది. ఒకే జిల్లా ఒకే రేటుతో స్థానిక రైతులకు ఒకే రేటు చెల్లించేది. రైతులకు కూడా లాభాల బాటలో ఉండేవారు. కానీ ఇప్పుడు కొంతమంది పైరవీరులు కారణంగా ఈ ఐటిసిలో అక్రమాలు కొనసాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి అని మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఆంధ్ర జామాయిల్ రైతులపై వివక్షత చూపుతున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. ప్రాంతాలను బట్టి రేటు కేటాయించడంతో ఇక్కడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని ప్రాంతాల నుండి వచ్చే జామాయిల్ లోడు లో వాహనాల అడుగు భాగంలో తుమ్మ ,నల్లమద్ది వేప కర్రలు మిక్సింగ్ చేసుకొని వస్తారని, అటువంటి వాటికి గుట్టు చప్పుడు కాకుండా అధిక రేటు కు చెల్లిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నాణ్యమైన విలీన మండలాల నుండి ఎగుమతి చేసే ఒరిజినల్ జామ్ ఆయిల్ కర్రకు తక్కువ రేటు చెల్లిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే కొద్ది మంది రైతులతో ఒప్పందం కుదుర్చుకొని వారికి మాత్రం అధిక రేటు చెల్లిస్తున్నారు. ఎక్కువ మంది రైతుల దగ్గర మాత్రం తక్కువ రేటుకు కొంటున్నారు. అది కూడా కొద్దిమంది రైతులతోనే కొనిపిస్తున్నారు. ఈ వివక్ష ఏంటో అర్థం కావడం లేదంటూ ఆయన ఆరోపించారు. ఐ టి సి పరిశ్రమ ద్వారా విడుదలయ్యే వ్యర్థాలు, మురికి నీరు వలన గోదావరి పరివాహక ముంపు మండలాలైన ఎటపాక, కూనవరం, విఆర్ పురం, చింతూరు మండలాల ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, ఇక్కడ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఇక్కడ రైతులకే అపార నష్టం కలిగిస్తున్నారని వారు విమర్శించారు .ఇక్కడ రైతులకే తక్కువ రేటు కేటాయించి ఐటీసీలోని కొంతమంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాని ఇక్కడి ముంపు మండలాల ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. భారతదేశంలో ప్రథమ స్థానంలో ఉన్న ఐటీసీ పరిశ్రమ లో ఇటీవలే ఇటువంటి అవకత లు జరుగుతున్నాయి అన్నారు. అసలు దీనివల్ల ఎవరు లాభపడుతున్నారనేది తేల్చాలన్నారు. ముఖ్యంగా ఐటిసి పరిశ్రమకు సరఫరా చేసే ముడి సరుకులు అవకతవకలు జరుగుతున్నాయని ఐటిసి లోనే చర్చ జరుగుతుందన్నారు. దీనిపై విచారణ జరపాలన్నారు. ఇకనైనా ఐటీసీలో ఇటువంటి అక్రమాలు జరగకుండా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని ముంపు మండలాల రైతుల కోరుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో చెలికాని ఉమా మహేశ్వరరావు, మాడెం సీతారాములు, ఎస్.కె రసూల్ , కర్నాటి శ్రీను, లంబు వాసు,తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు ఆరోగ్యానికి విషయంలో

# వెనకాడే ప్రసక్తే లేదు: ఎమ్మెల్యే ఆనందరావు

**ఉప్పలగుప్తం (నవభూమి)** అమలాపురం నియోజకవర్గం, ఉప్పలగుప్త%శీ% మండలం, సింగరాయపాలెం గ్రామం జంపన సూర్యనారాయణ రాజు మెమోరియల్ జకార్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ లయన్ జంపన సుమన్ వర్మ జన్మదిన సందర్భంగా వారి సహకారంతో మరియు అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్ వారి పర్యవేక్షణలో మెగా ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు హాజరవడం జరిగింది . జంపన సూర్యనారాయణ రాజు మెమోరియల్ జకార్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ లయన్ జంపన సుమన్ వర్మ గారు మాట్లాడుతూ ఇకనుండి పరిసర గ్రామాల్లో ఎటువంటి మెడికల్ సహాయం కావాలన్నా జకార్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించి ఉచిత సేవలందిస్తానని తెలియజేసినారుఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి నల్లా స్వామి, ఉప్పలగుప్తం మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మినారాయణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అశెట్టి ఆదిబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ వేణుగోపాలరావు మరియు ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.







# టీడీపీ నేత వజ్రాల కుమారరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**చిలుకూరి వారి గూడెం, సెప్టెంబర్ 14, నవభూమి:** లిబిమైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వజ్రాల కుమారరెడ్డి గారు ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శనివారం చిలుకూరి వారి గూడెంలో ఆయన నివాసానికి వెళ్లి వజ్రాల కుమారరెడ్డి గారిని పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు పాల్గొన్నారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

# వరదలకు మునిగిన వరి పొలాలను పరిశీలించిన సిపిఎం బృందం

**వి ఆర్ పురం నవభూమి న్యూస్ :-** మండలంలోని రాజపేట పంచాయతీలో గల తోటపల్లి గ్రామంలోని శబరి గోదావరి వరదలు రావడంతో మునిగిన వరి పొలాలను సిపిఎం బృందం పరిశీలించింది. వరదల మూడుసార్లు రావడంతో వరి పొలాలు పూర్తిగా మునగటంతో పనికిరాకుండా పోయాయని, కనీసం తోటపల్లి గ్రామంలోని 90 ఎకరాలు ఉంటుందని, శ్రీరామగిరి పంచాయతీలో పది ఎకరాలు, మండలం వ్యాప్తంగా చూసుకుంటే 3 వేలఎకరాలు పంట నష్టం జరిగిందని రైతులు సిపిఎం బృందం ముందు వారి సమస్యలను వెల్లబుచ్చారు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ మాట్లాడుతూ అధిక వర్షాలు కురవడంతో శబరి గోదావరి పొంగి వరదలు రావడంతో వరి పంట పొలాలు పూర్తిగా మునిగి పోయాయని, దేనికి పనికి రావని ఒక్కో ఎకరానికి 20 వేల రూపాయలు నష్టపరిహారం , అదేవిధంగా మిర్చి నారుమడులు మ ునగటంతో రైతులు చాలా నష్టపోయారని ఒక నారుమడి కి 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. తక్షణమే అగ్రికల్చర్ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం నాయకత్వం డిమాండ్ చేశారు. పరిశీలించిన వారిలో సిపిఎం నాయకులు సోడి స్మల్లయ్య, కుంజ కన్నయ్య, జి. లక్ష్మణరావు, టి. కాంతారావు, ప్రకాష్ రావు, రైతులు ముల్లి, సత్యనారాయణ, మడకం మల్లయ్య, పులి చందర్రావు తదితరులు పాల్గొన్నారు.





## సర్పంచ్ ఆధ్వర్యంలో చిన్న మట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో

# పారిశుద్ధ్య పనులు వేగవంతం







**వి ఆర్ పురం నవభూమి న్యూస్ :-** అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలం చిన్నమట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల తుష్టివారిగూడెం, ప్రత్తిపాక, గుండెగూడెం, చింతరేవుపల్లి, కన్నాయిగూడెం గ్రామాల్లో శబరి, గోదావరి వరదలకు మునిగిన ఇళ్లకు శానిటేషన్ పనులను సర్పంచ్ పిట్టా రామారావు ఆధ్వర్యంలో పనుల వేగంవంతం చేసి పనులు చేపిస్తున్నారు. అలానే ఇల్లు మునిగి వరదలో ఉన్న 100 కుటుంబాల నిర్వాసితులకు 1 లీటర్ కిరోసిన్, 1 లీటర్ పాలు, ఉప్పుపేకెట్లు అందజేసినారు. గోదావరి వరదలకు గ్రామాలలో ఉన్న చెత్త చేదారని పంచాయతీ కార్మికులు కారం తమ్మయ్యా, ముత్యాల నాగేంద్ర ప్రసాద్ ఎప్పటికప్పుడు శుభ్రము చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పి. వెంకటేష్, వీఆర్వో వినోద్, వీఆర్ఏ ప్రసాద్, గ్రామస్తులు కోటం జయరాజు, కోట్ల బాలరాజు, గుటాలా నవీన్ కుమార్, గుటాలా ముత్యాలరావు, కోట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో నేను ఉంట...

# సమస్యపై పోరాడుదాం...

- కూనవరం మండలంలో ఎటువంటి సమస్యని అయిన పరిష్కరిద్దాం
- యువత పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం ముందుకు రండి
- పోలవరం ప్యాకేజీపై త్వరలో నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందిద్దాం
- కూనవరం యువతతో ఆయుర్వేద వైద్యులు డా. జమాల్ ఖాన్

**కూనవరం నవభూమి న్యూస్ :** ఎవరికైనా ఆపద అని తెలిస్తే నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చి సమస్య పరిష్కరిస్తూ ప్రజల మన్ననలను పొందుతూ, వరద బాధితులకు దేవుడు అయినా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డా. జమాల్ ఖాన్ కు కూనవరం పంచాయతీ యువత మస్జీద్ వద్ద ఘనంగా దుస్సాలువాతో సత్కరించారు. శనివారం నాడు మస్జీద్ లో యువతతో ములాఖత్ అయిన వైద్యులు జమాల్ ఖాన్ యువత అన్ని రంగాలలో ముందు ఉండి సమస్యలకై పోరాడాలి అని, ఎవరికి ఎటువంటి ఆపద ఉందని తెలిసినా వెంటనే స్పందించే తత్వం రావాలని అన్నారు. అదే విధంగా శబరి గోదావరి మధ్య ఉన్న కూనవరం 2022 వరదల సమయంలో సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ తరుణంలో మా జె.కే. ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది అని అన్నారు. ప్రతీ ఏటా శబరి గోదావరి మధ్యలో ఉన్న కూనవరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి సహాయానికి అయినా వెనకడుగు వేయబోను అని, పోలవరం ప్యాకేజీ పై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి మీ అందరి ద్వారా అందిద్దాం అని అన్నారు. కూనవరం సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ గాంధీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా యువత ముందుకు వచ్చి ప్రభుత్వానికి మా బాధలు వివరించి పోలవరం ప్యాకేజీ త్వరగ ఇచ్చేలా ప్రయత్నం చేసే విధంగా సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు నివేదికలు అందించి సమస్యను వివరించాలని అనుకుంటున్నాం అని అన్నారు. నా తరపున మీకు ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తానని వైద్యులు జమాల్ ఖాన్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల.వెంకటేష్, దాసరి. యేసు, జల్లారపు.రవీంద్ర, దాసరి. కాశి, మొగదాల నాగు తదితరులు పాల్గొన్నారు.





# సెంట్రింగ్ కార్మికుడు కుటుంబానికి లక్ష ఆర్థిక సహాయం

## అందజేసిన సెంట్రింగ్ యూనియన్ కార్మికులు



**నందవరం (న్యాయం న్యూస్) సెప్టెంబర్14:** సెంట్రింగ్ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి భార్యకు ఎమ్మిగనూరు సెంట్రింగ్ యూనియన్ లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలో మండలం హాలహర్వి గ్రామానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు సక్కర రవి ఇటీవల మరణించడం జరిగింది,ఆ కుటుంబానికి ఎమ్మిగనూరు సెంట్రింగ్ యూనియన్ లక్ష రూపాయలు నగదును అందజేశారు.మంత్రాలయం సెంట్రింగ్ పని నిమిత్తం కి వెళ్ళిన సక్కర రవి ప్రమాదవశత్తు మూడవ అంతస్తు నుండి కిందకుపడి మరణించడం జరిగిన సంగతి తెలిసిందే,ఈ విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు సెంట్రింగ్ యూనియన్ వారు మా వంతుగా కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని పెద్ద మనసుతో ఆలోచన చేసి మృతుని భార్య రత్నమ్మకు లక్ష రూపాయలు అందజేశారు.సహాయం చేసిన ఎమ్మిగనూరు సెంట్రింగ్ యూనియన్ వారికి కుటుంబం వారు ధన్యవాదములు తెలిపారు.

# అందరికి న్యాయం జరిగేలా చూడండి



**కూనవరం నవభూమి న్యూస్ :-** పోలవరం బ్యాక్ వాటర్ వల్ల మునుగుతున్న ప్రజలందరికి న్యాయం జరిగేలా చూడాలని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య అన్నారు. సీపీఎం పార్టీ కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి వరదలు మండల వ్యాప్తంగా వస్తున్నాయని, వరదలు ఉన్న అన్నీ రోజులు గ్రామాల్లో ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ముంపుకి గురైన ప్రతి గ్రామానికి నిత్యావసరాలు ఇవ్వాలని అన్నారు. కూటూరు, పెద్దర్కూర్, అభిచర్ల,పంచాయితీలలో కొన్ని గ్రామాలకు ఇస్తే కొన్ని గ్రామాలకు నిత్యావసరాలు ఇవ్వలేదని అన్నారు. ప్రతి నిర్వాసితుడిని సమానంగా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ అమ్మజీ, జయసుధ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్ఎస్ఎమ్ ఈ ప్రాజెక్టుకు స్థల పరిశీలన

**మాడుగుల సెప్టెంబర్ 14 నవభూమి** మాడుగుల నియోజక వర్గం చీడికాడ మండలం లోని జి.కొత్తపల్లి అడవుల అగ్రహారం గ్రామాల్లో ఎం.ఎస్.ఎం.ఈ ప్రాజెక్టు కు సంబంధించి శనివారం స్థల పరిశీలన కార్యక్రమం చేపట్టారు.స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మండల రెవెన్యూ అధికారుల తో కలిసి స్థల పరిశీలన ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం లో మండలం లోని కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మాతృశాఖ పునరుద్దరణతో పాలాభిషేకం చేసిన ఎక్సైజ్ సిబ్బంది




**కోసిగి. సెప్టెంబర్14 (నవభూమి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ను రద్దు చేసి,మాతృ శాఖను పునరుద్దరణ చేసినందుకు ఆనందంతో కోసిగి ఎక్సైజ్ సిబ్బంది గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కు, గౌరవ ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ధన్యవాదములు తెలుపుతూ పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ శాఖను మాతృశాఖలో కలుపుతూ జీవో విడుదల చేయడం తమకు ఎంతో ఆనందం కలిగించిందని వారు సంతోషం వ్యక్తం చేశారు .అలాగే గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం ఆ ఇబ్బందులు తొలిగిపోయాయని వారు అన్నారు. కోసిగి కార్యాలయానికి గతంలో ఉన్న నేమ్ తొలగించి కొత్తగా జారీ చేసిన జీవో ప్రకారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అని రాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోసిగి స్టేషన్ ప్రొహిబిషన్ %ఽ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ప్రొహిబిషన్ %ఽ% ఎక్సైజ్ సబ్-ఇన్స్పెక్టర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాడుగులలో సెజ్ ఏర్పాటు చేయాలి

**మాడుగుల సెప్టెంబర్ 14 నవభూమి** నియోజక వర్గ కేంద్రం మాడుగుల లో ఎస్.ఇ.జడ్ (సెజ్) ఏర్పాటు చేయాలి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి.రామ రాజు నియోజక వర్గ స్థానిక ఎమ్మెల్యే కి శుక్రవారం విజ్ఞప్తి చేశారు.నియోజక వర్గంలో నిరుద్యోగులను దృష్టి లో పెట్టుకొని వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు సెజ్ ఏర్పాటు చేయాలి అని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దృష్టి లో పెట్టుకొని ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగుల కు ఉపాధి అవకాశాలు కల్పించాలి అని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చా నాయకుడు నారాయణ రావు పార్టీ ప్రతినిధి మండల సతీష్ పాల్గొన్నారు.



# ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంచి నీటి బోరు ఏర్పాటు



**మాడుగుల సెప్టెంబర్ 14 నవభూమి** నియోజక వర్గ కేంద్రం మాడుగులలో మోద మాంబ కొలని లో వేంచేసియున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం లో మంచి నీటి బోరు ను శనివారం స్థానిక ఎంపీటీసీ కె.మహేశ్వరి ప్రారంభించారు. ఎంపీటీసీ కె.మహేశ్వరి నిధుల నుంచి ఈ మంచి నీటి బోరు ను ఏర్పాటు చేశారు.ఈ బోరు నిర్మాణం ఆలయానికి వచ్చిన భక్తులకు ఉపయోగపడుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఈ మంచి నీటి బోరు ఏర్పాటు కు సహకరించిన ఎంపీటీసీ మహేశ్వరి కి కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పోరాట యోధునికి విప్లవ జోహార్లు: సిపిఎం



**మాడుగుల సెప్టెంబర్ 14 నవభూమి** మాడుగుల మండలం మాడుగుల పంచాయతీ లో కనికరమాత కాలనీలో సిపిఎం పార్టీ కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన సెప్టెంబరు 12వ తేదీన గురువారం మధ్యాహ్నం 3 గంటల కు ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు.ఈ కార్య క్రమం లో సిపిఎం పార్టీ మాడుగుల మండల కార్యదర్శి ఇరట నరసింహామూర్తి మండల నాయకురాలు కె.భవాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారు.విద్యార్థి ఉద్యమం నుంచి వచ్చిన ఆయన అంచలంచెలుగా జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు.2015 లో విశాఖలో జరిగిన జాతీయ మహాసభల్లో కామ్రేడ్ సీతారాం ఏచూరి సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.భారత రాజకీయాలకు సీతారాం ఏచూరి మార్గదర్శకంగా వ్యవహరించారు.దేశ ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం ఏచూరి లేకపోవడం దేశానికి , ముఖ్యంగా సిపిఎం పార్టీకి తీరని లోటు అని అన్నారు.ఆయన ఏ ఆశయ సాధన కోసం అయితే పరితపించారో ఆ ఆశయ సాధనకు అందరు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళులు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బొట్టా కన్నారావు బట్ట సుశీల జలుమూరు నూకరత్నం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లారీని వెంబడించి పట్టుకున్న హైవే పోలీసులు



**ఒంగోలు, సెప్టెంబరు 14 (నవభూమి)** ఒంగోలు పట్టణంలోని సంఘమిత్ర ఆసుపత్రి వద్ద శనివారం రాత్రి గోరా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళు తున్న ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి వస్తున్న లారీ వేగంగా ఢీ కొట్టి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే పోలీసులు వెంకటరామయ్య రాజాలు, మేదరమెట్ల వద్ద లారీని అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

# వేటపాలెంలో మృతదేహం కలకలం



**వేటపాలెం, సెప్టెంబరు 14 ( నవభూమి)** వేటపాలెం లోని కాలువ నందు శనివారం యువకుడి మృతదేహం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు వెలికి తీయించారు. మృతుడు వేటపాలెం కు చెందిన లక్ష్మణాచారి(20) గా పోలీసులు గుర్తించారు. అయితే తన కుమారుడు చెడు వ్యసనాలకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి రాఘవ స్టేషన్ నందు ఫిర్యాదు ఇచ్చారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# 250 మందికి వైద్య పరీక్షలు..

## ఒంగోలు కిమ్స్ హాస్పిటల్




**కుర్రవాని పాలెం, సెప్టెంబరు 14 (నవభూమి)** కొరిశపాడు మండలం కుర్రవానిపాలెం గ్రామంలో శనివారం ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ నాదెండ్ల దశరథ రామయ్య ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఆయా వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు సర్పంచ్ నాదెండ్ల దశదరామయ్య భోజన ఏర్పాట్లను చేశారు.మొత్తం మీద 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సాయి తేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రామాంజనేయులు, సునీల్, హెల్త్ క్యాంప్ మేనేజర్ కాలేషా, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**చాగలమర్రి, (నవభూమి)::**బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వని అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 13వ అంగనవాడీ కేంద్రంలో పోషణ మాసో త్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి తల్లులకు వివరించారు. పౌష్టికా హారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. సమావేశంలో టీఎన టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సుశీల, ఏపీవో నిర్మల, ఏఎనఎం లీలావతి, అంగనవాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.దొర్నిపాడు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా దొర్నిపాడు వెలుగు కార్యాలయం లో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భిణులు పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఏపీఎం బాబు, రజితారెడ్డి, ఏఎన ఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

# ప్రశాంత పల్లెలను వైకాపా నేతలు ఫ్యాక్షన్ కేంద్రాలుగా మార్చారు

## మంత్రి గొట్టిపాటి రవికుమార్





**అద్దంకి, సెప్టెంబర్ 14 ( నవభూమి )** పల్లెలను వైకాపా నేతలు ఫ్యాక్షన్ కేంద్రాలుగా మార్చారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు.అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలో నిన్న రాత్రి తెదేపా సానుభూతి పరులు వినాయక నిమజ్జన విగ్రహం ఊరేగింపుగా వెళు తున్న సమయంలో పథకం ప్రకారం మాటువేసి విద్యుత్తు నిలుపుదల చేసి ముందుగానే సిద్ధం చేసుకున్న రాళ్ళు, కర్రలతో వైకాపా నేతలు మూకుమ్మడిగా విచక్షణా రహితంగా దాడి చేయడం పిరికి పంద చర్యగా అభివర్ణించారు. జగన్ రెడ్డి ఓడిపోయినా రక్త చరిత్ర రాస్తూనే ఉన్నాడని,హత్యా రాజకీయాలు ఇకనైనా ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని,బాధిత కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని. నిందితులను వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. వైకాపా ఫ్యాక్షన్ దాడులకు పులిస్టాప్ పెడతాం.శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. వైకాపా మూకల దాడిలో తలకు,కంటికి తీవ్రంగా గాయపడిన తెదేపా నేతలు యోగేశ్వరరావు, సుబ్బారావు, దేవదాసు, శ్రీను, లక్ష్మీనారాయణ, అనూరాధతో పాటు మరో ఐదుగురికి గాయలు కాగా చరవాణిలో మంత్రి పరామర్శించారు.

# స్వర్గీయ తలారి రామకృష్ణ భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## ఎన్డీఏ కూటమి పార్టీల నేతలు

**కృష్ణాజిల్లా గుడివేడ నియోజకవర్గం సెప్టెంబర్ 14** కుమారుడు డాక్టర్ సుదేష్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు..గుడివాడ పట్టణం14:: అనారోగ్య సమస్యలతో మరణించిన దివంగత తలారి రామకృష్ణ భౌతిక కాయానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు,జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పలువురు ఎన్ డి ఏ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం కుమారుడు ప్రముఖ వైద్యులు డాక్టర్ సుదేష్ బాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సమాజ శ్రేయస్సుకు రామకృష్ణ చేసిన సేవలను ఎమ్మెల్యే రాము ఇతర నాయకులు స్మరించుకున్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలిగి, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కలిగించాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. గుడివాడ పట్టణంలోని పలువురు ప్రముఖ వైద్యులు, పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, దివంగత రామకృష్ణ భౌతికకాయానికి పూలమాలలతో నివాళులర్పించారు.





# అద్దంకిలో భగ్గుమన్న ఫ్యాక్షన్ రాజకీయాలు







**అద్దంకి, సెప్టెంబరు 14 ( నవభూమి)** అద్దంకిలో ఫ్యాక్షన్ రాజకీయాలు మరోసారి భగ్గుమన్నాయి. శుక్రవారం రాత్రి వినాయకుడి నిమజ్జనం ఊరేగింపు సమయంలో టిడిపి, వైసిపి వర్గీల మధ్య చోటు చేసుకున్న వివాదం చిలికి చిలికి గాలి వానలా మారటంతో కొట్లాటకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా అద్దంకి ఉలిక్కిపడింది. ఈ కొట్లాటలో ఇరు వర్గాలకు చెందిన వారికి గాయాలు అయ్యాయి. ఒకానొక దశలో రాళ్లు రువ్వు కోవటంతో పాటు కారం, కట్టెలతో దాడి చేసుకున్నారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అంతటితో ఆగకుండా శనివారం టిడిపికి చెందిన వర్గీయులు వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి సమీప బంధువు కు చెందిన పెట్రోల్ బంకు, క్లషర్ లారీలకు నిప్పు అంటించారు. దీంతో పోలీసులు గ్రామంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. మరోవైపు వైసీపీ నేత ప్రభాకర్ రెడ్డి బంధువుకు చెందిన క్లషర్ వద్ద కూడా పోలీసులు బందోబస్తు ను ఏర్పాటు చేశారు. అయితే కావాలనే టిడిపికి చెందిన వాళ్లు తమ వర్గీయులపై దాడికి పాల్పడ్డారని నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ సమన్వయకర్త హనిమిరెడ్డి ఆరోపించారు. దాడులు జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆయన విమర్శించారు. తమ పార్టీ హయాంలో ఎప్పుడూ దాడులు జరగలేదని హనిమిరెడ్డి చెప్పారు.

# దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి

**కర్నూలు(నవభూమి)::**దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి అని జిల్లా మోటార్ వర్క్స్ యూనియన అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటా నికి పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్, గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు. ఏపీ వేర్ హస్ హమాలీ యూనియన కమిటీ ఆధ్వర్యంలో వేర్ హౌస్ లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఆర్.నరసింహులు, సాయిబాబా, పాల్గొన్నారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు సిటీ కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, సీహెచ.శ్రీనివాసులు, శేషా ద్రి, మద్దిలేటి, కర్రెన్న పాల్గొన్నారు. కార్మిక కర్షక భవనలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్య దర్శి నగేష్ పాల్గొన్నారు.ఓర్వకల్లు: సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు నన్నూరు గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మధుసూదన, సుధాకర్, శేఖర్, ఎల్లరాజు, మాసూంబాషా, శ్రీరాములు, ఈశ్వరయ్య, జీవేశ్వరుడు పాల్గొన్నారు.గూడూరు:

## ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



**బనగానపల్లె, (నవభూమి)::**ఆల్బెండజోల్ మాత్రలతోనే నులిపురు గుల నివారణ సాధ్యమని, 19 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వాడాలని వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు సూచించారు. బనగానపల్లె ఎంపీడీవో నాగరాజుకు, మండల విద్యా?ధికారి కార్యాలయంలో విద్యాధికారి స్వరూప, సీఆర్‌పీలు ప్రసాద్, సుధాకర్‌కు శుక్రవారం వైద్యుడు మాత్రలను అందించారు. మండలంలో 19,500 మంది 19 సంవత్స రాలలోపు వారు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. సెప్టెంబరు 17వతేదీ జాతీ య నులిపరుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశా లలకు ఈమాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది వెంకటే శ్వర్లు, అయ్యమ్మ, రమేశ, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎనఎంలు పాల్గొన్నారు.

## వరద బాధితులకు విరాళాలు



**కర్నూలు(నవభూమి)::**విజయవాడ వరద బాధితుల సహాయార్థం, ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆలిండియా సెంట్రల్ పారా మిలిటరీ ఫోర్సెస్ ఎక్స్ సర్వీస్ మెన వెల్ఫేర్ అసోసియేషన నాయకులు విరాళం అందిం చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజితబాషాకు రూ.75 వేల విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. అసోసి యేషన జిల్లా కమిటీ తర పున అసోసియేషన అధ్యక్షుడు ఎస్. బాలరంగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ అసోసియేషన కార్యదర్శి జి. శేషారెడ్డి, యూనియన ట్రెజరర్ పీటీ స్వామి, యూనియన సలహాదారులు కేకే రావు, కేసీఎస్ రాయుడు పాల్గొన్నారు.

## ఆ జీవోతో స్టాఫ్ నర్సులకు అన్యాయం

**ఆదోని (నవభూమి)::**ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్.115తో తమకు అన్యాయం జరుగుతుందని స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. శు క్రవారం మాతా శిశు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. సచివా లయ ఏఎన్‌ఎంలను స్టాఫ్‌న ర్సులుగా నియమించ డంపై అభ్యంతరం తెలిపారు. 25 ఏళ్లుగా ఒప్పంద ప్రాతిప దికన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హెడ్‌నర్సు ప్రమీల, స్టాఫ్‌న ర్సులు అనిత పుష్ప, నందిని, జ్యోతి, బిందు, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.ఎమ్మిగనూరు టౌన్: ఏఎన్‌ఎంలకు స్టాఫ్ నర్సు ఉద్యోగాలివ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. శశికళ, నిర్మల రాణి, చంద్రకళ, నరసింహులు పాల్గొన్నారు.



### అన్నదాతలు అధైర్య పడవద్దు...

# సాగునీటిని విడుదల చేస్తా

- కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే ఏలూరి భరోసా
- కాలువకు గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి వేస్తున్నాం
- రెండు రోజుల్లో ఆయకట్టుకు నీరు విడుదల
- చివరి భూమి వరకు నీరు అందిస్తాం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి





**పర్చూరు, సెప్టెంబర్ 14 (నవభూమి)** కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతాంగం అధైర్య పడవద్దని పంటలకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు అన్నదాతలు సాగునీరు రావడంలేదని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, అధికారులతో మాట్లాడి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన శనివారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డి ఈ, ఏఈలతో మాట్లాడారు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వరదల కారణంగా కొమ్మమూరు కాలవపై బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో 17 చోట్ల పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చివరి భూములకు సైతం సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గత ఐదేళ్లు కాలవలు మరమత్తులకు నోచుకోకపోవడం వల్ల వరదల కారణంగా కాలువకు గండ్లు పడ్డాయన్నారు. గతంలో వరదల కారణంగా వేలాది ఎకరాల్లో పంట నష్టపోయారని ఏ ఒక్క రైతుకు ఇబ్బంది పడకూడదని లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన కాలవ మరమత్తులు చేపడుతున్నట్లు వివరించారు. చివర భూములకు నీరు అందించాలనే లక్ష్యంతో కాలువకు1500 క్యూసెక్కుల నీరు విడుదల విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు, ఎరువులు, అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఆనందంగా ఉండటమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.

### అప్పుస్మా ఆధ్వర్యంలో

# బెస్ట్ టీచర్స్‌కు అవార్డులు

**నెల్లూరు,సెప్టెంబర్ 14,(నవభూమి)::**నెల్లూరు టౌన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అపుస్మ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర పతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పలువురు అపస్మా నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల మనుగడుకు ఆన్ అపుస్మా ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.అలాగే ఉపాధ్యాయుల సంక్షేమానికి కూడా కుసుమ అండగా నిలుస్తుందని అన్నారు.నెల్లూరులో అపుస్మ బెస్ట్ టీచర్స్ అవార్డ్ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ ఎంవి రామచంద్ర రెడ్డి తెలిపారు.అపుస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించుకోవడం అభినందనీయమని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అపుస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.అపుస్మా ఆర్గనైజేషన్ యూనిటీగా ఉంటూ.. ప్రైవేట్ స్కూల్స్ అన్నింటినీ ఏకతాటిపై నడిపించడం అభినందనీయమన్నారు.అపుస్మా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటూ కోవిడ్ సమయంలో,వరదలు లాంటి విపత్తులు వచ్చిన సమయంలో ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు,నివాస స్థలాలు ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు తమ కృషి చేస్తామని తెలిపారు.అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,రామచంద్రారెడ్డి, అపుస్మా రాష్ట్ర సీనియర్ నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి లు సత్కరించారు.ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.




